క్లుప్తంగా

మాదకద్రవ్యాల విక్రేత అరెస్ట్

రాజేంద్రనగర్: మాదకద్రవ్యాలను విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి మూడు గ్రామాలు ఎండీఎంఏ మాదకద్రవ్యంతో పాటు ఆడీ కారును స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. పాత బస్తీ ఖాజీపురా ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీర్(28) వస్త్రాల వ్యాపారి. తన స్నేహితుడి వద్ద నుంచి ఐదు గ్రాముల ఎండీఎంఏను కొనుగోలు చేశాడు. రెండు గ్రాములు ఉపయోగించిన అనంతరం మూడు గ్రామాలను ఇతరులకు విక్రయించేందుకు సిద్ధమైయ్యాడు. హిమాయత్‌సాగర్ రోడ్డు వద్ద విక్రయించేందుకు రాగా అప్పటికే సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డిజిటల్ ఫొటోగ్రఫీలో కోర్సులకు ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జేఎన్‌ఏఎఫ్‌ఏ వర్సిటీలో భాగమైన ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో డిజిటల్ ఫొటోగ్రఫీలో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఆర్ కమల్‌రాయ్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వర్సిటీలోని ప్రభుత్వ లలితకళల కళాశాల ప్రిన్సిపాల్‌ను లేదా 72073 09581, 98851 20948 లలో సంప్రదించవచ్చని సూచించారు.

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది'

గోల్కొండ: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్‌లోని జనహిత కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, ఉన్నత విద్య కళాశాలల్లో ర్యాంగింగ్‌ను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మరోవైపు జూనియర్ కళాశాలల యాజమాన్యాల దౌర్జన్యాలకు విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కళాశాల హాస్టళ్లలోనే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుండటం ఎంతో బాధాకరమైన విషయమన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా తమ పార్టీ ఆధ్వర్యంలో నేడు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరగనున్న బీజేపీ నిరసన దీక్షకు గుడిమల్కాపూర్ నుంచి భారీగా తరలివెళ్తున్నామని పేర్కొన్నారు.

'జీవితం ప్రజా సేవకే అంకితం'


గోల్కొండ: తండ్రి ఆశయ సాధనకు తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తానని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ సంతాప సభతో పాటు దేవర వంశీ పరిచయ కార్యక్రమం ఆదివారం గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఉప్పరబస్తీ, రామచంద్రయ్య కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్‌లో బీజేపీని అజేయమైన శక్తిగా తన తండ్రి తీర్చిద్దిదారని, దానిని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోడి అశోక్‌యాదవ్, దేవర శ్రీనివాస్, నామ యాదగిరి, సందేశ్ యాదవ్, జొన్నకంటి మధుసూదన్, మురారియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌కు కేలండర్ అందజేత



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ రూపొందించిన 2023 వార్షిక కేలండర్‌ను ఫోర్‌మెన్ కమిటీ అధ్యక్షుడు పోసాని సురేందర్ ముదిరాజ్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, అమ్మవారి మహత్యమును ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతినిధులు శ్రీకాంత్‌గౌడ్, సతీష్ ముదిరాజ్, నాగరాజు, ప్రభు, శేఖర్, అనిల్ పాల్గొన్నారు.

'కుడా' కార్యదర్శిగా శంకర్‌లాల్



చార్మినార్: కులీ కుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ (కుడా) కార్యదర్శిగా ఆర్. శంకర్‌లాల్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు చేపట్టిన గురువీర నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో జీహెచ్‌ఎంసీ దక్షిణ మండలం ఎస్ఈగా పని చేసిన ఆయనను ప్రభుత్వం కుడా కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుడా ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఎన్నో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను జరగనున్నాయని.. ఇప్పటికే కొన్ని హెరిటేజ్ కట్టడాల రెన్యూవేషన్ జరుగుతుందన్నారు.

రహదారి విస్తరణ జరిగేదెన్నడో?



- శంషాబాద్–షాబాద్ మార్గంలో పెరిగిన వాహనాల రద్దీ
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

శంషాబాద్ రూరల్: వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారి విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. మితిమీరిన వేగంతో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. శంషాబాద్–షాబాద్ మార్గంలో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోంది. ఈ మార్గంలోని పరిసర ప్రాంతాల్లో వెలసిన కొత్త కాలనీలు, గ్రామాల విస్తరణతో జనాభా పెరిగింది.

పారిశ్రామికవాడ రాకతో..

షాబాద్ మండలంలోని హైతాబాద్ వద్ద పారిశ్రామికవాడ రాకతో ఈ మార్గంలో రెండేళ్ల నుంచి వాహనాల రాకపోకలు పెరిగిపోయాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూలు, కళాశాల బస్సులతో పాటు కార్లు, ద్విచక్ర వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

శిథిలావస్థలో వంతెన..

రహదారిలో కాచారం సమీపంలో ఎంటేరు వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా వంతెన ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా పలు చోట్ల మూలమలుపులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వరద కాలువలు కబ్జా..

రహదారి సమీపంలో పలు చోట్ల ఉన్న వరద కాలువలను రియల్టర్లు కబ్జా చేశారు. నర్కూడ, కాచారం, మల్కారం, రామంజాపూర్ ప్రాంతంలో చాలా చోట్ల రహదారిపై కల్వర్టు ఉండగా.. వీటికి సమీపంలోని కాలువలను పూడ్చి వేశారు. కవేలిగూడ చౌరస్తాలో వరదనీరు వెళ్లే కాలువపై నిర్మాణాలు చేపట్టారు. దీంతో వర్షాకాలంలో వరదనీరు చౌరస్తాలో రోడ్డుపై నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

విస్తరణకు నోచుకోని రహదారి..

రెండు వరసలుగా ఉన్న శంషాబాద్–షాబాద్ మార్గం విస్తరణకు నోచుకోవడంలేదు. విస్తరణ కోసం చాలా సార్లు ప్రతిపాదనలు చేసినా అడుగు ముందుకు పడడంలేదు. శంషాబాద్ పట్టణం నుంచి నర్కూడ వరకు సుమారు ఆరు కి.మీటర్ల దూరం వరకు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అయితే పట్టణంలోని బస్టాండ్ నుంచి నర్కూడ శివారులో ఉన్న ఒయాసిస్ స్కూలు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి కొన్ని నెలల కిందట నిధులు మంజూరు అయ్యాయి. కానీ పనులు మాత్రం ఇంకా మొదలు పెట్టడంలేదు.



కాచారం సమీపంలో ఎంటేరువాగుపై షాబాద్ రహదారిలో శిథిలావస్థలో వంతెన

ఉత్సాహంగా వార్షికోత్సవం

రాజేంద్రనగర్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయల పాత్ర ఎంతో కీలకమైందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకోని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్, లక్ష్మయ్యగుప్తా, వివేక్, ఘట్టయ్య, ప్రేమ్‌దాస్‌గౌడ్, సాగర్, చంద్రమౌళి, ప్రేమ్‌గౌడ్, శ్రీను, నర్సింగ్‌గౌడ్, ఉపాధ్యాయులు మాణిక్యంరెడ్డి, ఎన్.టి.జాన్సన్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

'వృద్ధులకు అండగా ఉంటాం'

రాజేంద్రనగర్: వృద్ధులకు శ్రీనివాస సేవా సమితి ఎల్లవేళల తోడ్పాటు అందిస్తుందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల సాయిమాలిక్ వెల్లడించారు. ఆదివారం బన్సీలాల్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బుద్వేల్‌కు చెందిన వృద్ధ దంపతులు తన వద్దకు వచ్చి తాము పడుతున్న ఇబ్బందులను వివరించారన్నారు. వారిని అన్ని రకాలుగా సంస్థ ఆధ్వర్యంలో ఆదుకుంటామన్నారు. వృద్ధుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చోరవ తీసుకుంటామన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి సైతం తీసుకువెళ్లి వారికి అండగా ఉంటామని వెల్లడించారు.



వృద్ధులతో మాట్లాడుతున్న సాయిమాలిక్

ఘనంగా బోనాల ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. పల్లెచెరువు కట్ట మైసమ్మ ఆలయం వద్ద తెలంగాణ వీర భద్రీయ (వీర ముష్టి) సంఘం కేంద్ర కమిటీ, తెలంగాణ సంచార జాతుల ఎంబీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 65 ఏళ్ల ఉమ్మడి బోనాల ఉత్సవాలను పురస్కరించుకోని వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుడి చల్లని ఆశీస్సులు దీవెనలతో ప్రజలందరు జీవితాంతం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

నాలా పరిరక్షణకు న్యాయ పోరాటం చేస్తాం



వినతిపత్రం అందజేస్తున్న పట్టణ కౌన్సిలర్లు

శంషాబాద్: సాతంరాయి సర్వే నంబరు 2, 5, 6 వద్ద ఫిరంగి నాలాను పూర్తి స్థాయిగా రోడ్డుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్న తీరుపై పట్టణ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉన్న సుమధుర, అపర్ణ కన్‌స్ట్రక్షన్ సంస్థలు రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆదివారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఫిరంగి నాలాలో గతేడాది ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసి బోర్డు పాతినప్పటికీ దానిని ఉద్దేశపూర్వకంగా తొలగించి రోడ్డుగా మార్చేశారన్నారు. తాజాగా పూర్తి స్థాయిలో రోడ్డుగారే మార్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులతో కలిసి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. నాలా పరిరక్షణకు అవసరమైన న్యాయపోరాటం చేస్తామన్నారు. కౌన్సిలర్లు భద్రునాయక్, సునీత, కుమార్, మక్రజీజాన్, నాజియాబేగం, వెంకటేష్ ముదిరాజ్, రాణి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్‌యాదవ్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న విజయ డయగ్నొస్టిక్ సెంటర్ నిర్వాహకులు

రాజేంద్రనగర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్ దుర్గానగర్‌లోని విజయ దయగ్నొస్టిక్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కొంగల శ్రీధర్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చిన్న, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

రాజేంద్రనగర్: ఎండా కాలం నేపథ్యంలో రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డివిజన్ల పరిధిలోని బస్తీలు, కాలనీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌ఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని ఇంటి వద్దకు వచ్చే చెత్తసేకరణ దారులకు అందించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా చెత్త సేకరణదారులు రాకపోతే స్థానికంగా ఉండే కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతిరోజూ తాము చెత్తసేకరణదారుల నుంచి హాజరును తీసుకుంటున్నట్లు తెలిపారు. బస్తీలు, కాలనీలలోని చెత్తాచెదారాన్ని పోగు చేసి ఎవరైనా కాలుస్తే తమకు సమాచారం అందించాలన్నారు.



నలందానగర్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మణికొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మణికొండ వాసవి క్లబ్ కపుల్స్ శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎన్ ఎస్ సుధారాణి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా మణికొండ కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా నిరీష, ప్రధాన కార్యదర్శిగా వంశీకృష్ణ, కోశాధికారిగా రామ్ సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వేడుకల్లో పాల్గొన్న మణికొండ వాసవి క్లబ్ కపుల్స్ సభ్యులు

కార్వాన్‌లో చివరి దశకు డ్రైనేజీ పనులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో సుమారు రూ.300 కోట్లతో జరుగుతున్న డ్రైనేజీ పనులు చివరి దశలో ఉన్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్‌లో కొత్త డ్రైనేజీ పనులు చేయించిన సందర్భంగా ఖాదర్‌బాగ్ మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్ వర్గబేధాలు, వివక్షకు తావులేదని స్పష్టం చేశారు. కార్వాన్ నియోజకవర్గంలోని అవసరం ఉన్న అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. మజ్లిస్ సెక్యులర్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు చెందిన ప్రార్థనా స్థలాలును, శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ షబ్బీర్ ఖాన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సండే.. సందడి



చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. పర్యాటకులు ఉదయం నుంచే పాతబస్తీకి క్యూ కట్టారు. దీంతో ఎటూ చూసినా.. సందడే.. సందడే కనిపించింది. చిరు వ్యాపారాలు జోరుగా కొనసాగాయి. అయితే గుల్జార్‌హౌజ్ వద్ద పురాతన గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఎంతమంది ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణలో ఉన్నప్పటికీ.. ఫౌంటేన్ పనుల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అర్ధరాత్రి దాటిన అనంతరం ఫౌంటేన్ పనులు చేస్తే బాగుంటుందని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

పద్మశాలి నిత్యాన్నదాన సత్రానికి విరాళాలు

గోల్కొండ: బాసరాలోని అఖిల భారత పద్మశాలి నిత్యాన్నదాన సత్రానికి పద్మశాలి సంఘాల నుంచి విరాళాలు వస్తున్నాయని సత్రం అధ్యక్షుడు రాపోలు సుధాకర్ అన్నారు. ఆదివారం కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు జూలూరి మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ సత్రానికి తమవంతు విరాళంగా రూ.51 వేల చెక్కును అందజేశారు. అదే విధంగా కార్వాన్ మార్కండేయ భవన్ ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులకు కాడిగ పాండయ్య, సప్పాల హరిదాసులు రూ.51 వేల చెక్కును అందజేశారు. బాసరలో నిర్మిస్తున్న పద్మశాలి నిత్యాన్నదాన సత్ర భవనానికి ఈ నిధులు వాడుతామని సత్రం అధ్యక్షుడు రాపోలు సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గజం గురునాథం, పద్మశాలి సంఘం గౌరవ, అధ్యక్షులు గుండు గోపాల్, నర్సింగరావు తదితరులున్నారు.



సాక్షి, సిటీబ్యూరో: జీవితంలో శిశుదశ అత్యంత ముఖ్యమైన దశ అని శ్లోక ది స్కూల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కూల్ ఆవరణలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భవానీ, ప్రీప్రైమరీ కో ఆర్డినేటర్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కేవీ' కొనసాగాల్సిందే..

- ఈ మూడేళ్లు విద్యార్థుల భవిష్యత్ నాశనం చేయొద్దు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
- ఒప్పంద గడువు ముగిసిందంటున్న హెచ్‌సీయూ
- ఆర్థిక భారమే ప్రధాన కారణం



హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయం కొనసాగే భవనం ఇదే..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయ (కేవీ) భవిష్యత్‌పై నీలినీడలు అలుముకున్నాయి. ఒప్పంద గడువు ముగియడంతో ఇక మూసివేయాలని హెచ్‌సీయూ ఆదేశాలిచ్చింది. దీంతో ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏంటని వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. కేంద్రీయ విద్యాలయాన్ని హెచ్‌సీయూలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బీజేపీ నాయకులతో కలిసి హెచ్‌సీయూ ప్రధాన గేటు ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే.

పదేళ్ల ఒప్పందంతోనే కేవీ ఏర్పాటు

- 2013–14లో పదేళ్లపాటు కొనసాగేలా హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించారు.
- దీని నిర్వహణకు హెచ్‌సీయూపై ఏటా రెండు కోట్ల భారం పడినా భరిస్తోంది.
- ఇక ఆర్థిక భారం మోయలేమని, మూసి వేయాలని హెచ్‌సీయూ స్పష్టమైన ఆదేశాలిచ్చింది.
- క్రమక్రమంగా కింది తరగతుల అడ్మిషన్లు నిలిపివేస్తూ రావడంతో హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయలో ప్రస్తుతం 7,8,9 తరగతుల విద్యార్థులు 240 మంది దాకా ఉన్నారు.

బండి సంజయ్ లేఖ..

హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయాన్ని మరో మూడేళ్లపాటు కొనసాగించాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు బండి సంజయ్ లేఖ రాశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆ లేఖలో కోరారు. కేంద్రీయ విద్యాలయ రీజనల్ అధికారులను కలిసి విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు

- ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు పదోతరగతి పూర్తి చేసేవరకు ఇక్కడే కొనసాగించాలి.
- ఈ మూడేళ్లు కూడా హెచ్‌సీయూ క్యాంపస్‌లోనే ఈ విద్యాలయం ఉండాలి.
- కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి–2గా మరో విద్యాలయానికి వేరే చోట స్థలం కేటాయించి, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన భవనం నిర్మించాలి. ఒకటో తరగతి నుంచి ప్లస్ టు వరకూ తరగతులు ఉండాలి.



హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలుపుతున్న విద్యార్థులు (ఫైల్)

పిల్లల భవిష్యత్‌ను కాపాడాలి



హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయాన్ని కొనసాగించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి. చదువులు మధ్యలోనే ఆగిపోకుండా చూడాలి. ఇంకో మూడేళ్లు అయితే పదవ తరగతి వరకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

–ఆర్ నర్సింహ, పేరెంట్

అర్ధంతరంగా అంటే ఎలా ?



అర్ధంతరంగా మూసివేస్తే విద్యార్థుల భవిష్యత్ ఏమిటి...? వచ్చే ఏడాది ఏ స్కూల్‌కు వెళ్లాలి. మధ్యలో వేరే సిలబస్ ఉన్న స్కూళ్లలో పిల్లలు చేరితే ఇబ్బందులు ఎదురవుతాయి. ఇంకో మూడేళ్లపాటు స్కూల్ కొనసాగించాలి.

–వినోద్, పేరెంట్

హెచ్‌సీయూలో కొనసాగించేలా చూస్తాం



కేంద్రీయ విద్యాలయాన్ని హెచ్‌సీయూలో కొనసాగించేలా చూస్తాం. బీజేపీ నేత రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కలిశాం. ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు. సేవ్ కేవీ కోర్ కమిటీ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తాం.

–గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్, గచ్చిబౌలి